# గుండె గుసగుసలు

డాల్ సరస్సులో బోటుషికారు చేస్తున్నంత ఆనందోద్వేగం అనసూయమ్మ కళ్లల్లో కదలాడుతోంది. ఎన్నో రోజుల నుండి ఎదిరిచూస్తున్న కొడుకూ-కోడలు అమెరికా నుండి వచ్చి ఇంటి గడపదాటగానే ఆబగా గెండెలకు హత్తుకుంది. అంబరాన్నంటిన సంబరం అలాగే ఉంది. ఏడుపదుల వయసులో పదహారేళ్ల బాలాకుమారిలా మారి ఇల్లంతా తానే అవుతోంది. వాళ్ళొచ్చి వారం రోజులైనా అదే ఆనందము. అవగింజంత గూడా తగ్గలేదు.

తనలోని సంతోష తరంగాల్లా పొగలు గక్కుతున్న వేడి చాయకప్పు భర్తచేతికందించి, ఎదురు సోఫాలో కూచుంది. "ఆనాడు మన గుండెల మీదాడుకున్న నరేందర్ ఈనాడు అమెరికాలో అంత పెద్ద ఉద్యోగం చేస్తాడనుకోలేదండీ" అంటూంటే-చిరునవ్వుల పెదాలమీద ముత్యాల ముక్కుపుడుక తళుకులు బాలసూర్యకిరణాల్లో పరావర్తనం చెంది నుదుటి కుంకుమబొట్టును మెరిపిస్తున్నాయి. ముడతలు సంతరించుకోబోతున్న నుదుటి మీదాడుకుంటున్న ముంగురుల్ని ముని వేళ్లతో సవరించుకుంది.

వేడి చాయ సిప్ చేస్తుంటే రాఘవరావులో ఉత్సాహం ఉబికొచ్చింది. "నాగ్గూడా అనూ! నా వేలు పట్టుకుని వీధిబడికెల్లిన మన కొడుకు ప్రయోజకుడైనాడంటే అదంతా ఆ ఏడుకొండల వాడిదయనే. ఇవ్వాళ్ల ఉగాది... కొండంత పండగ గదా! వాని కిష్టమైన పప్పు భక్ష్యాలు, మిరపకాయ బజ్జీలు చేసిపెట్టు." కళ్లజోడు తీసి కొంటెగా చూడాలనుకున్నాడు. అప్పుడే అట్నుంచి కూతురు గొంతు "అమ్మా! వదినకు పట్టుచీరకట్టు సరిగ్గా రావడం లేదు. ఇదో చూడు. నేను దగ్గరుండి కట్టించాను." ఊర్మిళను చెయ్యిబట్టితీసుకొచ్చి తల్లిపక్కన కూచోబెట్టింది భూజాత. తానేమో కొంగునడుముకు బిగించుకుని వచ్చి తండ్రి ప్రక్కన కూచుంది.

"మీ వదిన అమెరికాలో పుట్టి పెరిగింది గదా!" నరేందర్ వచ్చి తల్లికీ, భార్యకు మధ్యన కూచున్నాడు. పాలనురగలాంటి తెల్లని దోవతి, ఆకుపచ్చ సిల్క్‌లాల్చీలో తండ్రికి జిరాక్సుకాపీ లాగున్న కొడుకును అదేపనిగా చూస్తోంది. అనసూయమ్మ అచ్చమైన తెలుగు డ్రెస్సులో భర్తను చూస్తున్న ఊర్మిళ తృప్తిగా నవ్వుకుంది. అంతాకలిసి ఊర్మిళ చూపులు భూజాతవైపు మళ్లాయి.

"నేను అమెరికాలో పుట్టి పెరిగినా మాది తెలుగు ఫ్యామిలీయే గదా మరదలా!" కాటుక కనురెప్పలు తురమ్మెద రెక్కల్లా కదిలాయి.

"బంగారం రంగు వదినకు మెరూన్ కలర్ పట్టుచీర బాలా సూటైంది. మా అమ్మ సెలక్షనంటే అలాగుంటుంది. ఈ చీరలో వదిన అమ్మవారి లాగుంది గదా నాన్నా!" భూజాత ఖాళీ కప్పు టీపాయ్ మీదుంచింది.

"నువ్వేమో పరమశివుని కోసం తపస్సు చేస్తున్న పార్వతి లాగున్నావు తల్లీ! వచ్చే ఉగాదికి నువ్వు నీ భర్తతో వస్తావుగదా! అప్పుడే ఇల్లు మరింత సందడిగా ఉంటుంది." రాఘవరావు గూడా ఖాళీ కప్పు ట్రేలో ఉంచాడు.

"అప్పటికి మీ వదిన ఒడిలోఓ చిన్నారి పాప ఉంటుంది." అనసూయమ్మ మురిపెం.

"అవును. వదిన ఇప్పుడు ఒట్టిమనిషి కాదు గదా!" భూజాత చూపు ఊర్మిళ మీద కేంద్రీకృతమైంది.

సింపుల్ స్కూలు టీచర్‌గా సర్వీసులో చేరిన రాఘవరావు సీనియర్ లెక్చరర్‌గా రిటైర్ కాబోతున్నాడు.

ఇద్దరే సంతానం. పెద్దవాడు నరేందర్, యం.సి.ఏ. ఫైనల్‌లో ఉన్నప్పుడే కాంపస్ సెలక్షన్‌లో పేరున్న కంపెనీ పట్టేసింది. ఫస్టుక్లాసులో పాసై బాంబేలో జాయినయ్యాడు. అమోఘమైన ప్రతిభాపాటవాలు. కంపెనీ యాజమాన్యాన్ని ఆకట్టుకున్నాయి. వెంటనే విమానమెక్కించి అమెరికా పంపించారు. నెలనెలా... ఇండియన్ కరెన్సీలో చూస్తే ఆరంకెల జీతం. ఇల్లు, కారు కంపెనీవే.

ఆదిలాబాదు నుండి అమెరికా వెళ్లి స్థిరపడిన శ్రీనివాసరావు కుటుంబముతో పరిచయమైంది. ఆ శ్రీనివాసరావు ముద్దుల కూతురే ఊర్మిళ. ఒకే అపార్ట్‌మెంట్‌లో పక్కపక్క పోర్షన్లు అమెరికాలో స్థిరపడ్డా తెలుగు వెలుగుల్ని గుండెల్లో దాచుకున్న శ్రీనివాసరావు దంపతులు ఊర్మిళకు ఇంట్లోనే తెలుగు నేర్పించారు. అమెరికా డ్రెస్సుల్లో తిరుగుతున్నా ఊర్మిళ పండగ రోజుల్లో తెలుగు డ్రెస్సే వేసుకుంటుంది. ఓ రోజు నరేందర్‌ను తానే పలుకరించింది.

నిష్ణాతుడైన శిల్పి ఊహల్లో ఉయ్యాలలూగిన శిల్పసౌందర్యాన్ని సొంతం చేసుకున్న ఊర్మిళ మొదటి చూపులోనే అయస్కాంతములా ఆకట్టుకుంది. రెండేళ్లలో పరిచయం ముదిరి ప్రణయముగా పరిణమించింది. ప్రణయం పరిణయానికి దారిదీసింది. పిట్స్‌బర్గ్ శ్రీ వెంకటేశ్వరాలయములో మూడుముళ్లతో జీవితాలు ముడిపడ్డాయి. అప్పుడే రాఘురావు దంపతులు కూతురుతో సహా అమెరికా వెళ్లారు. వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య జరిగిన పెళ్లి కన్నవారి కడుపునింపింది.

భారతీయ సంస్కృతిని వారసత్వంగా పుణికి పుచ్చుకున్న ఊర్మిళ వారం క్రితమే... మొదటిసారి అత్తారింట్లో అడుగుపెట్టింది. నూతన సంవత్సరము వినూత్న జంటను ఆత్మీయంగా ఆహ్వానించింది. అటు పీ.జి పూర్తవగానే భూజాతకిటు పెళ్లిచూపులైనాయి. హైద్రాబాదులో సెటిలైన రాఘవరావు తమ్మునింట్లో జరిగిన పెళ్లి చూపుల్లో అమ్మాయి – అబ్బాయి గదిలో కెళ్లి ఏకాంతంగా మాట్లాడుకున్నారు. దోరవయసులోని ఓరచూపులు అరగంటసేపు దోబూచులాడుకున్నాయి. నిర్మోహమాటంగా మాట్లాడుకున్నారు. మాటామంతిలో మనసులిచ్చి పుచ్చుకున్నారు.

“కొద్ది రోజుల్లో మా కొడుకూ–కోడలు అమెరికా నుండి వస్తారు. వాళ్లొచ్చింతర్వాతనే ముహూర్తాలు పెట్టిద్దాం”మన్నాడు రాఘవరావు. అంతా సరేనని అమోదముద్రవేశారు. కాబోయే భర్తను తలుచుకుంటూ భూజాత కలల అలల్లో తేలిపోతుంది.

అమెరికా నుండి రాగానే నరేందర్ మిత్రుల ఆహ్వానంతో కారులో భార్యతో సహ ఏవేవో ఊర్లు తిరిగాడు. ఓ మిత్రునింటికి పల్లెటూరు వెళ్లారు. జానపద వాతావరణం. ఊర్మిళకు బాగా నచ్చింది. పొలంగట్టు మీద నడుస్తూంటే రెక్కలు కట్టుకుని ఆకాశంలో విహరిస్తున్నట్టనిపించింది. మామిడి తోటలో పూతమీద తుమ్మెద ఝుంకారం వింటూ మైమరచి పోయింది.

మామూలు చీరకట్టు అలవాటైనా పండగ నాడు పట్టుచీర కట్టుకోవడం ఓపట్టాన కుదరక తంటాలు పడుతున్న ఊర్మిళను చూస్తుంటే భూజాతకు నవ్వొచ్చింది. నవ్వితే వదిన ఏమనుకుంటుందో! విచిత్రంగా చూస్తోంది.

“అట్లా గుడ్లప్పగించి చూసేబదులు వచ్చికాస్త సాయం చేయొచ్చు గదా మరదలా!” ఊర్మిళనే అడిగింది.

షడ్రుచుల పచ్చడి సేవిస్తూంటే ఊర్మిళకు పొలమారింది. మొహం పంచవర్ణ చిత్రమైంది. పక్కనున్న భూజాత వదినెత్తిమీద సున్నితంగా కొడుతూ “మీ అమ్మానాన్నలు గుర్తుచేస్తున్నారేమో వదినా!”

అంది కళ్లను కమ్మగా తిప్పుతూ.

"కావచ్చు" సర్దుకుంది ఊర్మిళ.

"మా అమ్మానాన్నల్ని చూడక వారం దాటింది. ఇన్ని రోజులు వాళ్లకు దూరంగా ఉండడమిదే ఫస్ట్‌టైమ్." అంది కళ్లు మిటకరిస్తూ.

"మా భూజాత గూడా మమ్ముల్ని విడిచి ఉండలేదు. పెళ్లయాక అత్తారింట్లా ఎలాగుంటదో ఏమో!" అంటూంటే అనసూయమ్మకు గొంతు గోడలకేదో పాకుతున్నట్టనిపించింది.

"ఆ విచారమే వద్దమ్మా!" నరేందర్ చెల్లినెత్తిమీదో మొట్టికాయిచ్చాడు. "బావ సాంగత్యములో సర్వస్వం మరిచిపోతుంది. అప్పుడు మనం గుర్తుకుంటామా?"

అనసూయమ్మ తృప్తిగా నిట్టూర్చింది. రాఘవరావు కళ్లల్లో ఆనందం తాండవించింది. భూజాత బుగ్గలు సిగ్గుల భారంతో ఎర్రమందారాలైనాయి. ఊర్మిళలో చిలిపిదనం. చిందులేస్తోంటే "ఆహా! అప్పుడే అమ్మాయిగారిలో పెళ్లికళ ఉట్టిపడుతుందత్తయ్యా!" మరదలి జడలాగి ముందు కేసింది. గుండెలమీద కొచ్చి జడ వంకలు తిరిగిన నల్లతాచులాగైంది.

"పో వదినా!" వదిన బుగ్గ గిల్లింది భూజాత. "నువు మాత్రం మా అన్నయ్యను కొంగున ముడేసుకుని హాయిగా లేవూ!"

"పెళ్లయింతర్వాత ఏ ఆడదానికైనా మెట్టిల్లే పుట్టిల్లైపోతుంది. అదే మన సంప్రదాయంలోని ప్రత్యేకత." అనసూయమ్మ నిట్టూర్చింది.

రాఘవరావు మనసు ముప్పైమూడేళ్లు వెనక్కు లాగింది. "మా పెళ్లయిన కొత్తలో మీ అమ్మకు నెల రోజుల్దాకా పుట్టిల్లే గుర్తుకు రాలేదుర్రా!" అంటూంటే చిరునవ్వులో చిలిపిదనం తొంగి చూసింది. "పండక్కి వాళ్లింటికెళ్లినప్పుడు నీ మొగుడు బతకలేక బడిపంతులయ్యాడని మీ అమ్మ ఫ్రెండ్స్ గమ్మత్తుగా అంటూంటే నా చెవులారా విన్నాను."

"కాని కాలం మారిందిగదా మామయ్యా!" ఊర్మిళ అందుకుంది. "ఈ రోజుల్లో బతకనేర్చిన వారే బడిపంతుళ్లవుతున్నారని విన్నాను." పట్టుచీర కొంగును పదిలంగా సవరించుకుంది.

మధ్యాహ్నం పంచభక్ష్య పరమాన్నాలతో కలిసి భోంచేస్తున్నారు. పప్పు భక్ష్యం పనిబడుతూ ఊర్మిళ "కాబోయే తమరి లైఫ్ పార్ట్నర్‌నెప్పుడు చూపిస్తారటా!" భూజాత భుజం తట్టింది. ఒళ్లంతా గిలిగింతలమయమైంది భూజాతకు. సిగ్గుతో ఎడమచేత్తో కళ్లు మూసుకుంది.

"అయ్యో! అంత సిగ్గెందుకు చెల్లాయ్?" నరేందర్ భక్ష్యం ముక్కకు నెయ్యి అద్దుకుంటున్నాడు. కాబోయే బావగారిని రాబోయే శ్రీరామనవమికి ఇక్కడికే రమ్మందాం. ఇక్కడి రామాలయంలో సీతా రాముల కళ్యాణం చూడముచ్చటగా ఉంటుందిగదా ఏమంటారు నాన్నా!"

"నేనేమంటాన్రా!" మిరపకాయబజ్జి నములుతున్నాడు రాఘవరావు. "తప్పకుండా రమ్మందాం. నవమి తర్వాత వాళ్లమ్మా నాన్నల్ని రమ్మని ఇక్కడే ముహూర్తం పెట్టిద్దాం." ఊర్మిళ పెరుగన్నం జుర్రుకుంటోంది.

"ఆనందమానందమాయనే, మా భూజాత పెళ్లికూతురాయనే" అంటూ కళ్లమీంచి చెయ్యిలాగేసింది. భూజాత కిలకిలానవ్వింది. ఊర్మిళ శృతి కలిపింది. ఇద్దరు యువతుల నవ్వుల్లో గంగాయమునల సంగమ ధ్వని వినిపించింది.

"తింటున్నపుడు నవ్వకండమ్మా, మళ్ళీ పొలమారుతుంది." గుర్తుచేసింది అనసూయమ్మ.

పంచాంగ శ్రవణానికి అంతా కలిసి గుడికి వెళ్ళారు. జనాలతో గుడి నిండిపోయింది. తెలిసిన వారంతా ఊర్మిళను ఆప్యాయంగా పలుకరిస్తున్నారు. ఒకరికొకరి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెప్పుకుంటూ మురిపాలు పంచుకుంటుదన్నారు. పెద్ద ముత్తైదువలు ఊర్మిళ వీపు నిమురుతూ "అమెరికాలో పుట్టి పెరిగినా ఆదిలక్ష్మిలాగున్నావమ్మా" అంటూంటే పారవశ్యం ఆవహించింది. రాశిఫలాలు వింటూ రంగుల లోకములో అడుకుంది మనసు.

×××××

ప్రకృతి ఒళ్లు విరిచి చాలాసేపైంది. ఆకాశ వీధిలో సూర్యుడు సంచారానికి బయలుదేరాడు. వసంతం సర్వాంగ సుందరంగా అలంకరించుకుంది.

"హల్లో... ఆ, నేనే... భూజాతను... ఇక్కడంతా బాగే.... ఛీ... పో... పది రోజుల నుండి సమాచారం లేదు...ఆ! నేను చెయ్యకపోతే తమరు చెయ్యరు గదా!... ఓహ్! అట్లానా!.... అద్సరే గానీ అమెరికా నుండి మా అన్నయ్య-వదినలొచ్చారు. మా వదినవాళ్లది తెలుగు కుటుంబమే. అక్కడే పుట్టి పెరిగింది. ఇండియా వాతావరణం కొత్త... అవును. ఆవిడతోనే సరిపోతుంది.... అబ్బా! నాకు సిగ్గేస్తుంది బాబూ!... కబుర్లు చాలుగానీ మీరు శ్రీరామనవమికి మా ఇంటికి రావాలి. ఇక్కడ రామాలయంలో సీతారామకళ్యాణం, సమ్మక్క-సారక్క జాతరలా సాగుతుంది.... పెద్దల పర్మిషనా?... అదే, మా నాన్న మీ నాన్నగారితో మాట్లాదారు... ఓకే.... సీయూ...."

పెరట్లో జామచెట్టు కింద... కాబోయే శ్రీవారితో సెల్‌ఫోన్లో మాట్లాడిన భూజాత ఎదురుగా నరేందర్ కనబడగానే సిగ్గులమొగ్గై ముడుచుకుపోయింది. జామ కొమ్మల్లోంచి చొచ్చుకొచ్చిన లేత సూర్యకిరణాలు ఒంటిరాయి ముక్కుపుడకమీద తళుక్కుమంటూ పోటీపడ్తున్నాయి.

"అమ్మదొంగా! బావగారితోనే గదా!" చెవి మెలేశాడు నరేందర్.

"ఆ.... అదీ.... అవును!" బుగ్గల్ని అరచేతుల్లో దాచుకుని వంటింట్లోకి తుర్రుమంది.

"అనూ... అనసూయా!" గబగబా వంటింట్లో కొచ్చాడు రాఘవరావు. వంటలో తల్లికి సాయం చేస్తోంది భూజాత.

"అబ్బా! ఏమిటండీ?" మిగిలిపోయిన పనుల్ని తలుచుకుంటూ చేతుల్ని కొంగుకు తుదుచుకుంది అనసూయ "ఏదన్నా అర్జంటా?"

"అదేమీ కాదు గానీ మనమనుకున్నట్లు కాబోయే వియ్యంకుడితో ఫోన్‌లో మాట్లాడాను. రామనవమికి వాళ్లబ్బాయిని పంపిస్తామన్నారు."

"శుభం!" నరేందర్-ఊర్మిళ గూడా అబ్బాయిని చూస్తారు. కొద్ది రోజులు అంతా కలిసుంటారు" గదవకింది చెమటను కొనకొంగుకు అద్దుకుంది.

భూజాత తుర్రుమనగానే నరేందర్ చెట్టుకిందకెళ్లి సెల్‌ఫోన్ విప్పాడు. హైదరాబాదు కాలేజీలో క్లాస్‌మేట్, రూమ్మేటు అయిన ఆత్మీయ మిత్రుడు రాంగోపాల్‌తో మాట్లాడాడు. శ్రీరామవనమికి వాళ్ళూరికి రమ్మని ఆహ్వానించాడు.

"నేను అటొచ్చే బదులు నువ్వు నీ భార్యతో మా ఇంటికి రావచ్చు గదా! రెండుమూడ్రోజులు కబుర్లతో గడిపేద్దాం రా!" రాంగోపాల్ సలహా.

"అది కాదురా బాబూ! శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం మా ఊళ్లో బ్రహ్మాండంగా జరుగుతుంది. అదిచూసి తీరాల్సిందే. నా భార్యగూడా సంతోషిస్తుందిరా! ప్లీజ్... నువ్వే రారా!"

"ఓకే.... వస్తా. అక్కడే నా పెళ్లిగురించి నీకో తీపి కబురు చెప్తా.!"

"థ్యాంక్యూరా దోస్త్." సెల్‌ఫోన్ జేబులో పడింది. వంటింట్లో కొచ్చాడు ఖుషీగా.

"నాన్నా! అమ్మా! నాక్లోజ్ ఫ్రెండు శ్రీరామనవమికి మనింటికొస్తున్నాడు. వాడు గూడా కొద్దిరోజులిక్కడే ఉంటాడు." మురిసిపోయాడు.

"శుభం!" అనసూయ ఆనందం. "నీక్కాబోయే బావగారు గూడా వస్తున్నారు. అంతా కలిసి హాయిగా కులాసాగా గడపొచ్చు" మొహం విచ్చుకుంది.

xxxxx

తెల్లవారితే శ్రీరామనవమి,

ఆ రోజు ఉదయమే నరేందర్ బస్టాండ్‌కెళ్లి తన క్లోజ్ ఫ్రెండును రిసీవ్ చేసుకుని తీసుకొచ్చాడు. వసారాలో ఎవరూ లేరు.

"అమ్మా! నాన్నా అంతా రండి. ఇదో నా ఫ్రెండొచ్చాడు" ఆత్రంగా కేకేశాడు. "మేము కాలేజీలో, హాస్టల్లోగూడా కలిసున్నాం గదా!"

"వస్తున్నామన్నయ్యా!" కోయిల గొంతుతో భూజాత గదిలోంచి బయటికొచ్చింది.

"ఇదోరా... నా చెల్లి భూజాత. పెళ్లిగూడా ఖాయమైంది." ఫ్రెండు బుజమ్మీద చెయ్యేసి సోఫాలో కూచోబెట్టబోయాడు నరేందర్. కూచోబోయి భూజాతను చూస్తూ షడెన్‌గా లేచి నుంచున్నాడతడు. కళ్లనిండా ఆశ్చర్యానందాలు.

"మీ్మ...మీ...మీరా?" భూజాత మొదట విస్తుబోయి వెంటనే రెండడుగులు ముందుకొచ్చింది. మనసు లేడిపిల్లలా గంతులెయ్యబోతోంది. చెక్కిళ్లు విరబూసాయి. ముఖారవిందము వెయ్యి దళాలుగా విచ్చుకుంది. పులకింతల్లో తేలిపోతుంది.

"భూ...జా...తా!" ఫ్రెండ్ రాంగోపాల్ ఒళ్లంత గిలిగింతలు. కళ్లల్లో ఆనందకెరటాలు కదుల్తున్నాయి.

నరేందర్ అయోమయం.

"అదేమిట్రా! మా చెల్లి నీకంతకుముందే పరిచయమా?"

"అవును పెళ్ళిగురించి నీకుచెప్పాలనుకున్న తీపికబురిదే. భూజాతతో నా పెళ్లి సెటిలైంది."

"అం....టే... నాక్కాబోయే బావ...!"

"ఈ అబ్బాయే రా" అంతకుముందే వచ్చి నుంచున్న రాఘవరావు దంపతుల ఆనందానికి అవధుల్లేవు.

"చూడమ్మా ఊర్మిళా!" కోడలు చెయ్యందుకుంది అనసూయ." నీ ఆడబిడ్డకు కాబోయే శ్రీవారు. పేరు రాంగోపాల్. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్."

"నమస్కారమన్నయ్యా!" ఊర్మిళ చేతులు జోడించింది.

నలుగురి నవ్వుల పువ్వులతో ఇల్లు కళకళలాడింది. భూజాత - రాంగోపాల్ గుండెలు గుసగుసలాడుకుంటున్నాయి.

- (జాగృతి, 04-10-2010)